
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
ఆదివారం 5 అక్టోబరు 2025



భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 25.0



సరస్వతీదేవిగా చినవెంకన్న

చిన వెంకన్న కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం సరస్వతీదేవి 7 అలంకరణలో భక్తులను అనుగ్రహించారు.. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించారు.



రేవులో రాకపోకల పునరుద్ధరణ

నరసాపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నరసాపురం- సఖినేటిపల్లి రేవుల మధ్య శనివారం సాయంత్రం నుంచి పంటు రాకపోకల్ని పునరుద్ధరించారు. వరద కారణంగా ఏడు రోజులుగా రేవుల్లో రాకపోకలు నిలిచిపోయాయి. మొదట ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకోవడం, ఎగువ నుంచి వరద నీరు తగ్గడంతో పంటు, పడవల రాకపోకలు సాగాయి. ప్రస్తుతం వశిష్ఠ గోదావరిలో వరద ఉధృతి సాధారణ స్థితికి చేరింది. రేవులో మళ్లీ ప్రయాణికుల సందడి కనిపించింది. వరద తగ్గడంతో రాకపోకలకు అనుమతించినట్టు ఎంపీడీవో వీరభద్రరావు తెలిపారు.

గోదావరిలో వేట సందడి

గోదావరిలో మత్స్యకారులు చేపల వేట సాగిస్తున్నారు. గత వారం రోజులుగా ఎక్కడ పడవలు అక్కడే నిలిచిపోయాయి. చేపల కోసం కట్టిన వలకట్లను కూడా తొలగించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది గోదావరికి మూడు సార్లు వరద తాకింది. దీంతో మత్స్యకారులు వారం నుంచి పది రోజుల వరకు ఉపాధిని కోల్పోయారు. వరద తగ్గుముఖం పట్టడంతో వలకట్లు కట్టుకునేందుకు రెడీ అవుతున్నారు. వరద సమయంలోనే మత్స్యకారులకు వేట పుష్కలంగా ఉంటుంది.

విజయవాడకు చేరిన వైద్యుల సమ్మె

భీమవరం టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు డిమాండ్‌లతో చేపట్టిన సమ్మె విజయవాడకు చేరింది. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విజయవాడలో జరుగుతున్న ఆందోళనలో పాల్గొనేందుకు జిల్లాకు చెందిన సుమారు 80 మంది వైద్యులు వెళ్లారు. దీంతో పీహెచ్‌సీలలో వైద్యులు లేక సామాన్యులకు వైద్యసాయానికి కొంత అవరోధంగా మారింది. ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తోంది. సమ్మె ముగిసేవరకు ఇతర వైద్యులను పీహెచ్‌సీలకు నియమించారు.

9,10న కొత్త టీచర్ల పోస్టింగ్‌లపై కౌన్సెలింగ్

ఏలూరు అర్బన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 కొత్త టీచర్లకు పాఠశాలల్లో పోస్టింగ్‌లు కేటాయించేందుకు ఈనెల 9, 10వ తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించేలా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. డీఎస్సీకి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని యాజమాన్యాల నుంచి మొత్తం 1,146 మంది ఉపాధ్యాయులు ఎంపికకాగా, వీరికి ప్రస్తుతం ఇండక్షన్ ట్రైనింగ్ క్యాంపును భీమవరం, తణుకు, నరసాపురంలలో నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ శిక్షణ శిబిరం ఈనెల 10న ముగియనుంది. ఈలోపు కొత్త టీచర్లకు పోస్టింగ్‌లను కేటాయించాల్సి ఉంది. మాన్యువల్ విధానంలో నిర్వహించే కౌన్సెలింగ్‌ను శిక్షణ ముగింపునకు రెండురోజుల ముందుగానే పూర్తి చేయడానికి ప్రాథమికంగా నిర్ణయించారు. ఆ మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మండలాల వారీగా పాఠశాలలు, సబ్జెక్టుల వారీగా వేకెన్సీల వివరాలను ఖరారు చేశారు. ఆ ప్రకారం కేటగిరీ-3,4లోని పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలను తొలుత భర్తీచేయనున్నారు. ముఖ్యంగా జీరో టీచర్ స్కూల్స్‌కు కొత్త టీచర్లను కేటాయించడం ద్వారా ఉపాధ్యాయుడు లేని పాఠశాల ఉండకుండా తొలి ప్రాధాన్యం ఇస్తారు. కౌన్సెలింగ్ నిర్వహణ మార్గదర్శకాలు, ఏర్పాట్లపై సోమవారం అమరావతిలోని పాఠశాలవిద్య డైరెక్టరేట్‌లో నిర్వహించనున్న అన్ని జిల్లాల డీఈవోల సమావేశంలో స్పష్టత ఇవ్వనున్నారు.



వివాహేతర సంబంధానికి బలి !

- హత్య కేసులో ఆరుగురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన గూడెం డీఎస్పీ విశ్వనాథ్ 7

ఆటోవాలాకు అండగా..


డ్రైవర్లకు కూటమి సర్కార్ భరోసా
జిల్లాలో రూ.12.73 కోట్లు విడుదల
'ఆటో డ్రైవర్ల సేవ'లో కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి వర్మ

భీమవరం టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్లకు అండగా కూటమి సర్కార్ ఉంటుందని కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ భరోసానిచ్చారు. శనివారం భీమవరం మునిసిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన 'ఆటో డ్రైవర్ల సేవ'లో కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజులతో కలిసి కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ఆటోడ్రైవర్ల



చెక్కు అందిస్తున్న మంత్రి వర్మ, ఎమ్మెల్యే అంజిబాబు, మంతెన రామరాజు, కలెక్టర్ నాగరాణి

సేవలో కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం ప్రారంభించింద న్నారు. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా సొంత వాహనం కలిగిన ఆటో రిక్షా, మోటార్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు 2,90,669 మంది లబ్ధిదారుల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున రూ.436 కోట్లు నేరుగా జమ చేస్తున్నామన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు స్వయం కృషితో ఉపాధి సృష్టించుకొని చరిత్ర సృష్టిస్తున్నార న్నారు. వారి



అకౌంట్‌లో సొమ్ము జమైనట్టు వచ్చిన మెసేజ్

సమస్యలు తీర్చడం కోసం ప్రభుత్వం అన్ని ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తుందన్నారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేసినప్పుడు తాము ఆర్థికంగా నష్టపోతున్నామని ఆటోడ్రైవర్లు విన్నవించారని వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకునే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని భరోసానిచ్చారు. ఆటో డ్రైవర్ల సేవలో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వర్చువల్‌గా తిలకించారు.

200 ఆటోలతో భారీ ర్యాలీ

భీమవరం పాత బస్టాండ్ నుంచి 200 ఆటోలతో ఏర్పాటు చేసిన ఆటో ర్యాలీని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. పాత బస్టాండ్ నుంచి ఆటోలోనే కలెక్టర్, ఎమ్మెల్యే ప్రయాణించి ఆటో డ్రైవర్లను



ఆటో నడుపుతున్న మంత్రి వర్మ.. ఆటోలో కలెక్టర్, మంతెన

ఉత్సాహపరిచారు. జిల్లాకి సంబంధించి 8,439 మంది లబ్ధిదారులకు రూ.12.73 కోట్ల రూపాయల నమూనా చెక్కును ఆటో యూనియన్ ప్రతి నిధులకు అందించారు. మంత్రి వర్మ కలెక్టర్ నాగరాణి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజును ఆటోలో ఎక్కించుకొని స్వయంగా ఆటో నడపడం ప్రజలు ఆసక్తిగా తిలకించారు. జిల్లా ఆటో యూనియన్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, జిల్లా రవాణా అధికారి కృష్ణారావు, ఆర్డీవో కే.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా చేనేత అధికారి, స్పెషల్ ఆఫీసర్ కె.అప్పారావు, మునిసిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమలో కొత్త ఆక్వా జోన్



జిల్లాలో ఆక్వా రైతులకు భారీ ఊరట లభించనుంది. ఆక్వా జోన్ పరిధిలోకి వేలాది ఎకరాలు చేరేలా మత్స్యశాఖ చర్యలు తీసుకుంది. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి నేతృత్వంలో కమిటీ కొత్త ఆక్వా జోన్‌కు ఆమోదముద్ర వేసింది. దాదాపు అన్ని చెరువులు జోన్ పరిధిలోకి వచ్చేస్తున్నాయి. జిల్లాలో దాదాపు 1.42 లక్షల ఎకరాల్లో చెరువులు విస్తరించి ఉన్నాయి. అందులో 1.15 లక్షల ఎకరాలు మాత్రమే జోన్ పరిధిలోకి వచ్చాయి.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

- ప్రభుత్వానికి నివేదిక
- జోన్ పరిధిలోకి అదనంగా 27,700 ఎకరాలు
- మరో 6,200 ఎకరాల్లో కొత్త చెరువుల తవ్వకానికి అనుకూలం
- ప్రభుత్వ ఆమోదమే తరువాయి
- రిజిస్ట్రేషన్‌కు అధికారులు కసరత్తు
- జాయింట్ ఎల్పీ నంబర్లే అసలు సమస్య

గతంలోనూ కూటమి ప్రభుత్వమే జోన్ విధానాన్ని అమలు చేసింది. దాని పరిధిలోనే చెరువులు తవ్వకోవాలని దిశానిర్దేశం చేసింది. ఇష్టా రాజ్యంగా చెరువుల తవ్వకానికి చెక్ పెట్టింది. ప్రభుత్వం ఇచ్చే విద్యుత్ రాయితీ కూడా వాటికే వర్తింప చేసింది. వైసీపీ హయాంలోనూ పాత జోన్ విధానాన్నే అమలు చేశారు. దాంతో ఆక్వాజోన్ వెలుపల ఉన్న రైతులకు నష్టం వాటిల్లింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆక్వా రంగంపై దృష్టి సారించింది. ఉత్పత్తులు పెంచాలంటూ జిల్లాల వారిగా లక్ష్యాలను ఇస్తోంది. ఆక్వా రైతులకు అవసరమైన వసతులను కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. విద్యుత్ రాయితీని విస్తరించేందుకు ఆక్వాజన్ పరిధిలోకి చెరువులన్నింటినీ తెచ్చేలా ఆదేశాలు జారీచేసింది. ఆ మేరకు గడచిన మూడు నెలలుగా జిల్లాలో కసరత్తు చేస్తున్నారు. గ్రామాలు, మండలాల వారీగా ఆక్వా సభలను ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయిలోనూ సమీక్ష నిర్వహించారు. . ఆక్వాజోన్, చెరువుల రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పించారు. జిల్లాలో మరో 22,700 ఎకరాల్లో చెరువులను ఆక్వాజోన్ పరిధిలోకి తెచ్చేలా ప్రతిపాదన చేశారు. ప్రభుత్వానికి నివేదిక పంపారు. రైతులంతా రిజిస్ట్రేషన్ చేసుకునేలా నోటీసులు జారీచేయనున్నారు. మరో 6,200 ఎకరాల్లో కొత్తగా చెరువులు తవ్వుకునే అవకాశం ఉందని అధికారులు గుర్తించారు. జిల్లాలో ఆక్వా విస్తరించేదిశగా మత్స్యశాఖ కసరత్తు చేస్తోంది.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ఆక్వా చెరువులను రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటూ ప్రభుత్వం స్పష్టం చేసింది. జిల్లాలో 50వేల ఎకరాల్లోనే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మరో 85వేల ఎకరాల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. సర్వే నెంబర్‌లతో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం లేదు. ఎల్పీ నంబర్‌లు ఉండాలి. వైసీపీ హయాంలో జాయింట్ ఎల్పీ నంబర్‌లు కేటాయించారు. అదే ఇప్పుడు రిజిస్ట్రేషన్‌కు పెద్ద అవరోధంగా మారింది. జాయింట్ ఎల్పీ నంబర్‌లను కూటమి ప్రభుత్వం విడదీసే ప్రయత్నం చేస్తోంది. సరిహద్దులు గుర్తించలేక పోవడంతో గత ప్రభుత్వం జాయింట్ ఎల్పీ నెంబర్‌లు కేటాయించి రైతులను ముంచేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దస్తావేజులను పరిశీలిస్తున్నారు. హద్దులను నిర్ధారిస్తున్నారు. వేర్వేరు ఎల్పీ నంబర్‌లు కేటాయిస్తున్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను పరిష్కరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీలో రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే ప్రభుత్వ కల్పించే ప్రయోజనాలు రైతులకు అందుబాటులోకి రానున్నాయి. విద్యుత్ రాయితీకి కూడా రిజిస్ట్రేషన్‌తో ముడిపెట్టారు. గడువు విధించారు. కానీ క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు పరిష్కరించాలి. అప్పుడే రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉంటుంది. ఆక్వా విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో రైతుల్లో కొత్త ఆశాజనక వాతావరణం నెలకొంది.

కాంట్రాక్టర్ల జోష్

రూ.5 లక్షల లోపు బిల్లులకు ప్రభుత్వం పచ్చజెండా



నరసాపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్న కాంట్రాక్టర్లకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. గత పదేళ్ల నుంచి వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న రూ.5 లక్షల లోపు బిల్లులన్నింటిని క్లియర్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. మరో పది రోజుల్లో ఈ సొమ్ము కాంట్రాక్టర్ల ఖాతాల్లో జమ కానుంది. జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న రూ.40 కోట్ల బిల్లులకు మోక్షం కలగనుంది. అత్యధికంగా పురపాలక సంఘంలో బిల్లులే ఉన్నారు. భీమవరంలో సుమారు రూ.6 కోట్లు, నరసాపురం రూ.4 కోట్లు, పాలకొల్లు రూ.5 కోట్లు, తణుకు రూ.4 కోట్లు, తాడేపల్లిగూడెంలో సుమారు రూ.4 కోట్ల వరకు బిల్లులు ఉన్నట్లు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. మిగిలినవన్ని ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, గ్రామీణ నీటి సరఫరాకు సంబంధించిన బిల్లులు ఉన్నాయి.

జిల్లాలో రూ.40 కోట్ల వరకు పెండింగ్

రాష్ట్ర విభజన తరువాత టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు పెద్ద మొత్తాల్లో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 2019 వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత బిల్లులు చెల్లించలేదు. వాటిలో నీరు చెట్టు, 15వ ఆర్థిక సంఘం, ఎస్‌టీఎఫ్‌తో పాటు గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన గడపగడపకు, జల జీవన్‌మిషన్, ఆర్అండ్‌బీ, పంచాయతీ శాఖల్లో చాలా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో రూ.5 లక్షల లోపు బిల్లులు జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.40 కోట్లు వరకు ఉన్నాయి. అత్యధికంగా పురపాలక సంఘ పనులకు బిల్లులు పెండింగ్ పడ్డాయి. ఆ తరువాత ఇరిగేషన్‌లో నీరు చెట్టుకు సంబంధించిన బిల్లులు కూడా పెద్ద మొత్తాల్లో ఉన్నాయి. వీటిలో రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల బిల్లులు ఎక్కువగా ఉన్నాయి. రూ.10 లక్షల నుంచి రూ 15 లక్షలు పనుల బిల్లులు కూడా పెండింగ్ ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వీటిలో కొన్ని బిల్లుల్ని గత ఏడాది క్లియర్ చేసింది. మరిన్ని బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కాంట్రాక్టర్లంతా సంఘంగా ఏర్పడి ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి బిల్లులు చెల్లించాలని విన్నవించారు. వైసీపీ పాలనలో ఒక్క బిల్లు కూడా ఇవ్వలేదని వాపోయారు. సీఎం సానుకూలంగా స్పందించి దశల వారీగా క్లియర్ చేస్తామని హామీ ఇచ్చారు. తొలి విడత రూ.5 లక్షల లోపు బిల్లులన్నింటికీ మోక్షం కలిగించారు. నిధులు విడుదల చేస్తూ జీవో జారీ చేయడంతో కాంట్రాక్టర్లు సంతోషం వ్యక్తం చేశారు.

ఎంటీయూ 1318 రకానికి మాని పండు తెగులు

ముందు జాగ్రత్తలు తీసుకోవాలి
మార్టేరు శాస్త్రవేత్తల సమావేశం

పెనుమంట్ర, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేస్తున్న ఎంటీయూ 1318 రకం పొట్ట దశలో ఉన్నప్పుడు వర్షాలు కురిస్తే మాని పండు తెగులు ఆశించే అవకాశం ఉందని ఇన్‌చార్జి ఏడీ సహదేవరెడ్డి తెలిపారు. ముందు జాగ్రత్త చర్యగా చిరు పొట్ట దశలో ఒకసారి, పొట్ట దశలో ఒకసారి లీటరు నీటికి 1.0 మి.లీ ప్రోపికోనజోల్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మార్టేరు వరి పరిశోధన కేంద్రంలో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఖాళీగా వదిలేసిన లేక ముంపునకు గురైన పొలాల్లో అక్టోబరు మాసంలో కాకుండా నవంబరు 15 తరువాత నారు పోసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. అక్టోబరులో ఆకుమడులు పోస్తే నారు చలి ప్రభావానికి గురై ఎదుగుదల ఉండదని తెలిపారు. ప్రధాన శాస్త్రవేత్త గిరిజారాణి మాట్లాడుతూ దాళ్వా రకాలైన ఎంటీయూ 1293, ఎంటీయూ 1282 రకాలు నవంబరు నెలాఖరు కల్లా రైతులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఖరీఫ్‌లో జిల్లాలో 2.12 లక్షల ఎకరాలలో



సమావేశంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు

వరి సాగైందని జిల్లా మొత్తం మీద ప్రస్తుతానికి పంట చాలా ఆరోగ్యంగా ఉందని తెలిపారు. తాడేపల్లిగూడెం డివిజన్‌లో సుమారు 5 వేల ఎకరాలలో వరి తరువాత మినుము సాగుచేసేలా రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

టెట్ సెట్టవుతుందా..?!

ఇన్‌సర్వీస్ టీచర్లు సైతం ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లో ఉత్తీర్ణత సాధించాల్సిందేనంటూ సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల ఇచ్చిన తీర్పు... 2010వ సంవత్సరానికి ముందు ఉద్యోగంలో చేరిన గురువుల్లో కలకలం రేపుతోంది. టెట్ పరీక్షపై రాష్ట్ర ప్రభుత్వ ంనుంచి ఇంతవరకు అధికారిక ప్రకటనేదీ లేకపోయినా గతంలో ఎన్సీఈఆర్టీ (జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి) జారీ చేసిన నోటిఫికేషన్, తాజాగా సుప్రీం తీర్పు నేపథ్యంలో ప్రస్తుతం పనిచేస్తున్న టీచర్లు ఒకింత ఆందోళన చెందుతున్నారు.

- ఉపాధ్యాయ అర్హత పరీక్షపై ఇన్‌సర్వీస్ టీచర్లలో విస్తృత చర్చలు
- పరీక్ష తప్పనిసరైతే ఉమ్మడి జిల్లాలో 8 వేల మందికిపైగా టీచర్లపై ప్రభావం
- ప్రభుత్వం నుంచి సమాచారం లేదన్న డీఈవో



ఏలూరు అర్బన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): టెట్ పరీక్ష తప్పనిసరైతే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని యాజమాన్యాల్లో పనిచేస్తున్న 16 వేలకు మందికిపైగా టీచర్లలో కనీసం సగానికి పైగా టెట్‌కు ప్రిపేర్ కావడం, ఉత్తీర్ణత సాధించడం మినహా ప్రత్యామ్నాయం లేదని భావిస్తున్నారు. ఇప్పటికే దశాబ్దాల తరబడి తరగతి గదిలో బోధనానుభవంతో వున్న టీచర్లు మళ్లీ ఇపుడు అర్హత పరీక్ష (టెట్) ఏమిటని ఆశ్చర్యం వ్యక్తం చేస్తుండగా, మరికొందరు కోర్టు తీర్పుపై న్యాయస్థానంలో అప్పీల్‌కు వెళ్లనున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాలపై ఉమ్మడి జిల్లా డీఈవో వెంకట లక్ష్మమ్మను శనివారం వివరణ కోరగా... ఇన్ సర్వీస్ టీచర్లు టెట్‌లో అర్హత సాధించాలన్న విషయం సామాజిక మాధ్యమాల ద్వారానే తనకు తెలిసిందని, దీనిపై ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక సమాచారంగాని, నిర్ణయంగాని లేవని స్పష్టం చేశారు.

ఏంటీ సమస్య.

ఉపాధ్యాయ విద్యకు సంబంధించి డీఎడ్, బీఎడ్ అర్హతలున్నప్పటికీ, ఉద్యోగ నియామకాలకు అర్హత పరీక్ష టెట్‌లో ఉత్తీర్ణతను తప్పనిసరి చేస్తూ 2010 ఆగస్టులో ఎన్సీటీఈఆర్టీ నోటిఫికేషన్ జారీ చేసింది. దీనికనుగుణంగానే తదుపరి ఉపాధ్యాయ నియామకాల న్నింటికీ టెట్‌ను తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఆ ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ-2012 రిక్రూట్‌మెంట్ నుంచి టెట్ ఉత్తీర్ణతను తప్పనిసరి చేశారు. ఆ తర్వాత 2014, 2018, తాజాగా మెగా డీఎస్సీ-2025 నియామకాలన్నీ టెట్ ఉత్తీర్ణులతోనే జరిగినందున వీరి విషయంలో ఎటువంటి సమస్యలు తలెత్తే అవకాశం లేదు. ఈ క్రమంలో గతంలో అంటే 2010కి ముందు ఉద్యోగంలో చేరిన టీచర్లు కూడా ఇపుడు టెట్ రాసి అర్హత సాధించాల్సిందేనని ఇటీవల సుప్రీం కోర్టు తీర్పునివ్వడం, ఆ మేరకు రెండేళ్లలోపే టెట్‌లో ఉత్తీర్ణత సాధిం చాలని నిబంధన విధించడం... ఉపాధ్యాయుల్లో ఆందోళనకు కారణమైంది. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ప్రకారం ఐదేళ్లకు పైబడి ఉద్యోగకాలం వున్న టీచర్లంతా రెండేళ్ల వ్యవధిలో టెట్‌రాసి ఉత్తీర్ణులు కావాల్సిందే. అలా ఉత్తీర్ణత కాకపోతే ఉద్యోగంలో కొనసాగింపుపై టీచర్లలో డైలమా నెలకొంది.

ఒకవేళ టెట్ ఉత్తీర్ణత తప్పనిసరైతే...

150 మార్కులకు రెండున్నర గంటల వ్యవధితో ఉండే ఈ పరీక్షలో అర్హత సాధించడానికి ఓసీ కేటగిరీవారు 90 మార్కులు (60శాతం), బీసీలు 75 మార్కులు (50శాతం), ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు 60 మార్కులు (40శాతం) సాధించాల్సి ఉంటుంది. ఎస్జీటీలైతే టెట్ పేపర్-1, స్కూల్ అసిస్టెంట్లయితే పేపర్-2 రాయాలి. ఏ కేడర్ టీచర్లయినా 2030వ సంవత్సరం సెప్టెంబరు 30వ తేదీలోగా (అంటే ఐదేళ్లలోపు) రిటైరయ్యేవారు మాత్రం టెట్ రాయనవసరంలేదని చెబుతున్నారు. కానీ ఈ వ్యవధిలో ఉద్యోగోన్నతి పొందాలంటే మాత్రం టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి. ఆ ప్రకారం ఐదేళ్లకు మించి సర్వీస్ వున్న ఉపాధ్యాయులందరూ 2027వ సంవత్సరం సెప్టెంబరు 30లోగా టెట్ అర్హత సాధించాల్సిందే. ఇదిలా ఉండగా 2010కి ముందే నియామకం పొందిన టీచర్లు సంబంధిత కేడర్ నుంచి ఇప్పటికే ఉద్యోగోన్నతి పొంది ఉంటే టెట్ అవసరమా, మినహాయింపు ఉంటుందా అనే విషయాలపై సందేహాలు నెలకొన్నాయి.

ట్రెండ్



మా జీవితం మా హక్కు

కృత్రిమ మేథస్సు, సామాజిక మాధ్యమాలు విషపూరిత సమ్మేళనంగా మారిపోయాయి. మరీ ముఖ్యంగా కొందరు ఇన్‌ఫ్లుయెన్సర్లు, సంస్థలు పేరు కోసం, విక్రయాల కోసం ప్రముఖుల స్వరాలు, ఆహార్యాలను అనుకరించే పోకడను అనుసరిస్తున్నారు. ఈ పోకడ నెటిజన్లను అలరిస్తున్నా, నటులను మాత్రం ఒకింత అసహనానికి గురి చేస్తోంది. కాబట్టే తాజాగా కొందరు ప్రముఖులు వారి వ్యక్తిగత హోదానూ, హుందాతనాన్నీ పరిరక్షించుకోవడం కోసం కోర్టుల ద్వారా 'పర్సనాలిటీ రైట్స్'ను పొందుతున్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం!

ఐశ్వర్య దంపతులు సైతం

2024 మేలో, కొన్ని సంస్థలు జాకీ ష్రాఫ్ ఫొటోలను వాడుకుంటూ, అనధికారిక వస్తువుల అమ్మకాలు, వక్రీకరించిన వీడియోలతో వాణిజ్య లాభాలను ఆర్జిస్తున్నట్టు గుర్తించిన న్యాయస్థానం బాలీవుడ్ నటుడు జాకీ ష్రాఫ్ వ్యక్తిత్వ హక్కులకు కూడా రక్షణ కల్పించింది. అలాగే అనిల్ కపూర్ పేరు, ఫొటో, స్వరాలతో పాటు ఆయన సుప్రసిద్ధ క్యాచ్‌ఫ్రేజ్ 'ఝకాస్' అనే మాటను కూడా వినియోగించడానికి వీల్లేకుండా వ్యక్తిత్వ హక్కుల రక్షణను అనుమతించింది. అలాగే 2022 నవంబరులో హైకోర్టు అమితాబ్ బచ్చన్ వ్యక్తిత్వ, ప్రచార హక్కులు ఉల్లంఘనకు లోను కాకుండా రక్షణ కల్పించింది. గత సెప్టెంబరులో ప్రపంచసుందరి, బాలీవుడ్ నటి ఐశ్వర్యా రాయ్ బచ్చన్, అభిషేక్ బచ్చన్‌లతో పాటు నిర్మాత కరణ్ జోహార్‌ల వ్యక్తిత్వం, ప్రచార హక్కులకు కూడా రక్షణ కల్పించడం విశేషం. కరణ్ జోహార్ విషయంలో, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, పిన్‌ట్రెస్ట్, యూట్యూబ్‌లతో సహా వివిధ సామాజిక మాధ్యమాల వేదికల నుంచి అశ్లీల మీమ్స్ పోస్టులను తొలగించాలని కోర్టు ఆదేశించింది. అటువంటి కంటెంట్‌ను సృష్టించడం కోసం ఒక ప్రముఖుడి వ్యక్తిత్వాన్ని అనధికారికంగా ఉపయోగించడం వల్ల ఆ ప్రముఖుడి పేరు ప్రతిష్ఠలు దెబ్బతిన్నట్టు పేర్కొంది.

మధుర గాయని కూడా...



ప్రముఖ హిందీ గాయని ఆశాభోంస్లే, కృత్రిమ మేధస్సు సహాయంతో తన స్వరాన్ని దుర్వినియోగపరుస్తున్న ఏఐ కంపెనీ మింక్ ఇంక్‌తో సహా అనేక సంస్థలకు వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయించారు. దాంతో ముందస్తు అనుమతి లేకుండా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేదికలు, ఇ కామర్స్ సైట్‌లు, స్వతంత్ర విక్రేతలు ఆశాభోంస్లే స్వరాన్ని క్లోనింగ్ చేయడం లేదా ఆమె చిత్రాలు, పోలికలు, ఇతర వ్యక్తిత్వ లక్షణాలు దుర్వినియోగం కాకుండా బొంబే హైకోర్టు తాత్కాలిక రక్షణ కల్పించింది. డిజిటల్ యుగంలో ప్రముఖుల హక్కులను కాపాడే క్రమంలో న్యాయస్థానం ఇచ్చిన ఈ ఉత్తర్వు ప్రస్తుతం ఎంతో కీలకంగా మారింది.

నటుడు నాగార్జున కూడా...

పేరు, స్వరం, ఇమేజ్. ఏ నటుడికైనా ఇవెంతో ముఖ్యం. వీటిని ఏ కారణంగా దుర్వినియోగపరిచినా ఏ నటులూ ఉపేక్షించరు. వెంటనే కోర్టును ఆశ్రయించి, వ్యక్తిత్వ హక్కులను పొందే ప్రయత్నం చేస్తారు. నటుడు నాగార్జున ఇదే చేశారు. తాజాగా తన వ్యక్తిత్వ హక్కులకు రక్షణ కల్పించాలంటూ ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించి, అనుమతి పొందారు. అక్రమ వాణిజ్య ప్రయోజనాల కోసం వస్తువులను విక్రయించడం కోసం తన వ్యక్తిత్వాన్ని దుర్వినియోగం చేస్తున్నట్టు, తన ఫొటోలను అశ్లీల ఫొటోలతో మార్ఫింగ్ చేస్తున్నట్టు, యూట్యూబ్‌లో వీడియోలు సృష్టించడం ద్వారా, కృత్రిమ మేధస్సు సహాయంతో తనను ఉగ్రవాద సంస్థలతో, జూదంతో అనుసంధానిస్తున్నట్టు నాగార్జున తన వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఒక ప్రముఖ వ్యక్తి ఇమేజ్‌ను తప్పుదారి పట్టిస్తూ, అనుచితమైన, అవమానకరమైన మార్గాల్లో వారి ప్రవర్తననూ, ఆహార్యాన్నీ అనుకరిస్తూ ప్రతిష్ఠకు భంగం కలిగించినప్పుడు, వాళ్ల గుడ్‌విల్ దెబ్బ తింటుందని పేర్కొంటూ, ఢిల్లీ హైకోర్టు, నటుడు అక్కినేని నాగార్జున వ్యక్తిత్వం, ప్రచార హక్కులను కాపాడుతూనే ఆయన ప్రమేయం లేకుండా, పేరునూ, ఇమేజ్‌నూ, స్వరాన్నీ వాణిజ్యపరంగా ఉపయోగించకుండా కట్టడి విధించింది.



సండే సెలబ్రిటీ



దక్షిణాది, హిందీ సినిమాల ద్వారా ప్రేక్షకులపై తనదైన ముద్ర వేసిన హీరోయిన్ రాశీ ఖన్నా. తాజాగా ఆమె నటించిన 'తెలుసు కదా' సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆమెను 'నవ్య' పలకరించింది.

అలాగైతే పాతబడిపోతాం...

'తెలుసు కదా' టీజర్‌కు మంచి స్పందన వచ్చింది కదా... ఎలా అనిపిస్తోంది?

చాలా ఆనందంగా అనిపిస్తోంది. సినిమాను బాగా ప్రమోట్ చేస్తున్నాం. చాలా కాలం తర్వాత నేను చేస్తున్న తెలుగు సినిమా ఇది. కాబట్టి చాలా ఎక్సైటింగ్‌గా ఉంది. నాకు హైదరాబాద్‌లో ఇల్లు ఉంది. వచ్చిపోతూ ఉంటాను. ఇక్కడ షూటింగ్ జరుగుతూ ఉంటే పుట్టింటికి వచ్చినట్టు అనిపిస్తోంది.

మీరు అనర్గళంగా మంచి తెలుగు మాట్లాడుతున్నారు... ప్రాక్టీస్ చేశారా?

చాలాకాలంగా తెలుగు సినిమాలు చేస్తున్నాను కదా! తెలుగు వచ్చేసింది. నాకు తెలుగే కాదు... తమిళం, హిందీ కూడా బాగా వచ్చు. ప్రేక్షకులతో నేరుగా కనెక్ట్ కావటానికి భాష చాలా ప్రముఖమైన పాత్ర పోషిస్తుంది. అంతేకాదు... ఇది ఆయా భాషల ప్రేక్షకులకు నేను ఇచ్చే కనీస గౌరవం.

> నా తల్లితండ్రులు, మా అన్నయ్య, ఇద్దరు స్నేహితులు వీరందరూ నాకు మంచి సపోర్ట్. నాకు ఏ చిన్న సమస్య వచ్చినా వాళ్లతో చెబుతా!

మీరు హిందీ ప్రాజెక్టుల్లో కూడా నటించారు కదా... బాలీవుడ్‌కు, టాలీవుడ్‌కు ఉన్న తేడా ఏమిటి?



బాలీవుడ్‌లో హీరోయిన్లకు చాలా గౌరవం లభిస్తుంది. చాలా ఆదరంగా చూస్తారు. పైగా కాల్షీట్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల దాకానే ఉంటుంది. బాలీవుడ్‌లో కానీ, తమిళ పరిశ్రమలో కానీ కాల్షీట్ పన్నెండు గంటలు ఉంటుంది. అందువల్ల ఎక్కువగా అలసిపోతాం. అంతేకాకుండా ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. తెలుగు ప్రేక్షకులకు నా పట్ల అభిమానం ఎక్కువ. నేను ఇతర భాషల్లో చేసిన సినిమాలను కూడా వారు ఆదరిస్తూ ఉంటారు. సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపిస్తూ ఉంటారు.

> నేను భవిష్యత్తు గురించి పెద్దగా ఆలోచించను. ఎందుకంటే భవిష్యత్తులో ఏం జరుగుతుందో మనకు తెలియదు. చిన్నప్పుడు నేను ఐఏఎస్ ఆఫీసర్ కావాలనుకొనేదాన్ని. అనుకోకుండా హీరోయిన్ అయ్యా. ఇలా మనం అనుకున్నవన్నీ కావు.

బాలీవుడ్‌లో దక్షిణాది నటీనటుల పట్ల వివక్ష ఉందని విమర్శలు వినిపిస్తూ ఉంటాయి...

నాకు అలాంటి ఫీలింగ్ ఎప్పుడూ రాలేదు. అంతేకాదు, ఓటీటీ వచ్చిన తరువాత భాషపరమైన సమస్యలు తొలగిపోయాయి. ఇక్కడ హిందీ సినిమాలు, వెబ్ సిరీస్‌లు చూస్తున్నారు. అక్కడ దక్షిణాది సినిమాలు చూస్తున్నారు. ఓటీటీలు వచ్చిన తర్వాత మంచి నటులకు అన్ని భాషల్లోను అవకాశాలు లభిస్తున్నాయి.

నటనపై మీ అభిప్రాయమేమిటి?

నటనను ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ఉండాలి. నేను సినిమా రంగానికి వచ్చినప్పుడు నాకు ఏదీ తెలియదు. మనసుకు ఎలా అనిపిస్తే అలా నటించేదాన్ని. ఆ తర్వాత నటనకు కొన్ని టెక్నిక్స్ ఉంటాయని తెలిసింది. పుస్తకాలు చదవటం మొదలుపెట్టా. వీడియోలు చూసేదాన్ని. ముంబాయిలో నాటక రంగంలో పనిచేశా. ఎప్పటికప్పుడు నేర్చుకోపోతే ప్రేక్షకులకు బోర్ కొడుతుంది. మనం పాతపడిపోతాం!

మీరు స్క్రిప్టులు ఎలా ఎంపిక చేసుకుంటారు?

> ఒక నటిగా నాకు ఎప్పుడూ అభద్రతా భావం లేదు. నన్ను నేను ఎవ్వరితోను పోల్చుకోను. ప్రతి వ్యక్తికి తనదైన జర్నీ ఉంటుంది.

నేను చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటా. నా పాత్ర ఎలా ఉందనే విషయంపైనే ఎక్కువ దృష్టి పెడతా! కొన్నిసార్లు డైరక్టర్లు వచ్చి కథలు చెబుతారు. వాళ్ల దగ్గర స్క్రిప్ట్ ఉండదు. అలాంటప్పుడు చాలా ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కొన్నిసార్లు ఇతర కారణాల వల్ల కూడా ప్రాజెక్టులు ఓకే చేస్తా. కొందరు డైరక్టర్లకు మంచి దార్శనికత ఉంటుంది. అలాంటప్పుడు ఎలాంటి సమస్య ఉండదు. వారు చెప్పినట్లు చేసేస్తాను. కొందరు వచ్చి సలహాలు అడుగుతారు. నాకు తెలిసినంత చెబుతాను.

మీకు ఏ తరహా పాత్రలు చేయాలని ఉంది?

నాకు హారర్ ఫిల్మ్స్ చేయాలని ఉంది. ఎందుకంటే నాకు హారర్ సినిమాలంటే ఇష్టం. మైథాలజీ, యాక్షన్ ఫిల్మ్స్ కూడా చేయాలని ఉంది.

> నాకు ఓషో అన్నా, బ్రహ్మకుమారిల మార్గమన్నా ఇష్టం. ఆధ్యాత్మికతపై నాకు అవగాహన ఉంది. నేను ఈ పరిశ్రమలో నెగ్గుకురావటానికి అది కూడా ఒక కారణం. నేను ఏ పనిచేసినా నిబద్ధతతో చేస్తా. అయితే ఫలితాలు నా చేతిలో ఉండవనే విషయం కూడా నాకు తెలుసు.

మీరు సినిమాలూ చేశారు, వెబ్ సిరీస్‌లూ చేశారు. రెండింటి మధ్యా తేడా ఏమిటి?

కొంత తేడా ఉంది. వెబ్ సిరీస్‌లలో పాత్రల్లో అనేక కోణాలు ఉంటాయి. వాటిని చూపించటానికి ఎక్కువ సమయం ఉంటుంది. సినిమాల్లో అంత సమయం దొరకదు. అయితే నాకు సినిమాలంటేనే ఇష్టం.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

అమ్మో ఐ బొమ్మ


ప్రపంచంలో సినిమాను ప్రేమించే ప్రేక్షకులు ఉన్నంత కాలం, పైరసీ అనే భూతం వెంటాడుతూనే ఉంటుంది. ముఖ్యంగా తెలుగు సినీ పరిశ్రమను వణికిస్తున్న అలాంటి పైరసీ వెబ్‌సైట్లలో 'ఐ బొమ్మ' ఒకటి. ఈ పేరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. కొత్త సినిమా థియేటర్లలో విడుదలైన కొద్ది గంటల్లోనే, లేదా ఓటీటీలోకి వచ్చిన మరుక్షణమే హై - క్వాలిటీ ప్రింట్‌తో ఈ సైట్‌లో ఉచితంగా అందుబాటులోకి వస్తోంది. అయితే ఈ ఉచిత వినోదం తెలుగు సినిమా నిర్మాతలకు రూ. వేల కోట్ల నష్టం తెస్తోంది.

పైరసీ మాఫియా

'మూవీ రూల్జ్, ఐ బొమ్మ లాంటి సైట్స్ కేవలం సినిమాలను అప్‌లోడ్ చేసే వేదికలు మాత్రమే కాదు. దీని వెనుక ఒక పకడ్బందీ వ్యవస్థ ఉంది. అంతర్జాతీయ నెట్‌వర్క్ పనిచేస్తోంద'ని సైబర్ క్రైమ్ పోలీసులు చెబుతున్నారు. పైరసీ వల్ల తెలుగు సినీ పరిశ్రమకు వేల కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. ఒక్క 2024లోనే పైరసీ వల్ల తెలుగు చిత్ర పరిశ్రమకు రూ. 3700 కోట్ల భారీ నష్టం వాటిల్లిందని మాజీ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

చిన్న సినిమాల పాలిట విలన్

భారీ బడ్జెట్ చిత్రాలు, పాన్ ఇండియా చిత్రాలకు ఓటీటీ, శాటిలైట్ హక్కుల ద్వారా కొంతమేర నష్టం తగ్గినా, పైరసీ వల్ల అత్యధికంగా నష్టపోతున్నది మాత్రం చిన్న సినిమాలే. పలు సందర్భాల్లో చిన్న నిర్మాతలు, దర్శకులు వెలిబుచ్చిన ఆవేదన దీనికి అద్దం పడుతోంది. 'మా కలలను, మా పెట్టుబడినీ పైరసీ చంపేస్తోంది. మా పెట్టుబడిలో ఒక్క పైసా కూడా తిరిగి రావడం లేదు. ఇది ఇలాగే కొనసాగుతూ ఉంటే మరో సినిమా ఎలా తీయగలం' అని చిన్న నిర్మాతలు, దర్శకులు ప్రశ్నిస్తున్నారు. థియేటర్ల ద్వారా పెట్టుబడిలో కొంతైనా రాబట్టుకోవాలని చూసే చిన్న నిర్మాతల ఆశలపై ఐ బొమ్మ నీళ్లు చల్లుతోందనడంలో సందేహం లేదు. అలాగే పైరసీ అనేది థియేటర్ల ఆదాయంతో పాటు ఓటీటీ రెవెన్యూను సైతం దెబ్బతీస్తోంది. థియేటర్లలో



విడుదలతో పాటు ఓటీటీల ఆదాయానికి ఐ బొమ్మ లాంటి సైట్లు గండికొడుతున్నాయి.

పోలీసులకు సవాల్

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఐ బొమ్మతో సహా 65కు పైగా పైరసీ వెబ్‌సైట్లపై దర్యాప్తును ముమ్మరం చేశారు. ఐ బొమ్మపై దృష్టి సారించిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ నెట్‌వర్క్‌లో భాగమైన కొందరు ఏజెంట్లను అదుపులోకి తీసుకున్నారు. దాని నిర్వాహకులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ పైరసీ రాకెట్ హైదరాబాద్‌తో పాటు దుబాయ్, నెదర్లాండ్ వంటి విదేశీ ప్రాంతాల నుంచి పనిచేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. పైరసీముఠా కొన్ని ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, రికార్డింగ్, ఎడిటింగ్, అప్‌లోడింగ్, మానిటైజేషన్ చేస్తున్నట్టు వెల్లడించారు.

ఛేజింగ్ గేమ్

ఐ బొమ్మ లాంటి పైరసీ సైట్లు తమ డొమైన్లను తరచూ మార్చడం, సర్వర్లు విదేశాల్లో ఉండడం వల్ల వాటిని శాశ్వతంగా మూసివేయడం పోలీసులకు, పైరసీ సెల్‌లకు పెద్ద సవాల్‌గా మారింది. ఒక డొమైన్‌ను బ్లాక్ చేస్తే కొద్ది రోజుల్లోనే అది కొత్త పేరుతో కొత్త లింక్‌తో మళ్లీ ప్రత్యక్షమవుతోంది. ఇంటర్నెట్ ప్రపంచంలో ఇదొక అంతుచిక్కని 'ఛేజింగ్ గేమ్'గా మారిపోయింది.

పరిష్కారం ప్రేక్షకులు చేతుల్లోనే!

పైరసీని పూర్తిగా రూపుమాపడం కష్టమే అయినా, సినీ పరిశ్రమ, ప్రభుత్వం, ప్రేక్షకులు కలిసి పోరాడాల్సిన అవసరం ఉంది. అయితే ముఖ్యంగా మారాల్సింది ప్రేక్షకులే. పైరసీ లింక్‌లను ప్రోత్సహించకుండా, నాణ్యమైన వినోదం కావాలంటే థియేటర్లలో చూడడం, చట్టబద్ధమైన ఓటీటీ వేదికలను ఆదరించడం ఒక్కటే ఈ భూతం నుంచి తెలుగు సినిమాను రక్షించే మార్గం. వేల మంది కళాకారులు, సాంకేతిక నిపుణుల కష్టం, కలలకు ప్రతిరూపమైన సినిమాను పైరసీ కోరల నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ట్రూ హంటింగ్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 06
వార్ 2	హిందీ చిత్రం	అక్టోబర్ 09
ది ఉమెన్ ఇన్ కేబిన్	హాలీవుడ్ మూవీ	అక్టోబర్ 09
కురుక్షేత్ర	హిందీ సిరీస్	అక్టోబర్ 10
అమెజాన్ ప్రైమ్		
మెయింటనెన్స్ రిక్వైర్డ్	ఒరిజినల్ మూవీ	అక్టోబర్ 08
జాన్ కేండీ	డాక్యు మూవీ	అక్టోబర్ 10
జియో హాట్‌స్టార్		
మిరాయ్	తెలుగు చిత్రం	అక్టోబర్ 10
సెర్చ్: ది నైనా మర్డర్ కేస్	హిందీ సిరీస్	అక్టోబర్ 10



రంగురంగుల గాజులతో రమ్యంగా..

ఆభరణాలన్నింటిలో గాజులకు ప్రత్యేక స్థానం ఇస్తుంటారు మహిళలు. ఎన్ని నగలు పెట్టుకున్నా.. అందమైన గాజులు వేసుకోకపోతే అలంకరణ పూర్తికానట్టే! ఒకప్పుడు.. పెళ్లయిన మహిళలు చేతినిండా మట్టిగాజులు వేసుకునేవారు. యువతులు రంగురంగుల లక్క గాజులు, ప్లాస్టిక్ లేదా నైలాన్ గాజులు వేసుకునేవారు. క్రమంగా బ్లాక్ మెటల్, వైట్ మెటల్ బ్యాంగిల్స్ వచ్చేశాయి. ఇవి కాలేజీ యువతులను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. ఇక బంగారు గాజులు ఎప్పటికీ ప్రత్యేకమే. వాటిమీద కెంపులు, పచ్చలు, వజ్రాలు, ముత్యాలు, నీలాలు పొదిగి ఎన్నో అద్భుతమైన డిజైన్లను అందుబాటులోకి తెస్తున్నారు. వీటిని కేవలం పండుగలు, వివాహాది శుభకార్యాలకు మాత్రమే పరిమితం చేస్తున్నారు మహిళలు. రోజువారీ వేసుకోవడానికి వీలుగా మారుతున్న పోకడలకు అనుగుణంగా రకరకాల రాళ్ల గాజులు, థ్రెడ్ బ్యాంగిల్స్ అందుబాటులోకి వచ్చేశాయి. సీజెడ్, టోరమలీన్, టోపాజ్ లాంటి మామూలు రాళ్లతో డిజైన్ చేసిన గాజులను మహిళలు ఎక్కువగా ఆదరిస్తున్నారు. డ్రెస్‌కు మ్యాచ్ అయ్యేలా రంగుల దారాలు చుట్టిన గాజులు కూడా యువతులను ఆకర్షిస్తున్నాయి. కాలేజీకైనా కార్యాలయానికైనా వెళ్లేటప్పుడు చేతికి ఒక్క గాజు వేసుకుంటే చాలనుకుంటున్నారు. అంతలా మహిళల మనసు దోచుకున్న రంగురంగుల గాజులపై ఓ లుక్కేద్దామా...



దారాల గాజులు

ప్లాస్టిక్, లేదా మెటల్ బ్యాంగిల్స్‌కు రంగు రంగుల పట్టుదారాలను ఒక క్రమంలో చుట్టి కొసలను గమ్‌తో అంటిస్తారు. రెండు లేదా మూడు రంగుల దారాలను అందమైన డిజైన్ ప్రకారం చుట్టి తయారుచేసిన గాజులు గ్రాండ్‌గా కనిపిస్తాయి. వీటి మీద రంగురంగుల కుందనాలు, రాళ్లు, ముత్యాలు, బీడ్స్ కూడా అతికిస్తుంటారు. మువ్వలు వేలాడదీస్తుంటారు. సన్నగా, వెడల్పుగా లేదంటే లావుగా ఇలా ఏ ఆకారంలో కావాలంటే అలా ఇంట్లోనే దారాల గాజులు తయారు చేసుకోవచ్చు. గోల్డ్, సైడ్ బ్యాంగిల్స్ మాదిరిగా డిజైన్ చేసుకుని చేతులకు వేసుకుంటే నలుగురిలో ప్రత్యేకంగా కనిపిస్తారు. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, నీలం రంగుల దారాలతో లావుపాటి గాజులు సిద్ధం చేసుకుంటే రోజువారీ వేసుకోవడానికి బాగుంటాయి.





సీజెడ్ గాజులు

వజ్రాలకు ప్రత్యామ్నాయంగా సీజెడ్స్ ఉపయోగించి తయారుచేసే రాళ్ల గాజులను యువతులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ప్రస్తుతం వివిధ రంగుల్లో సీజెడ్స్ లభ్యమవుతున్నాయి. ఒక గ్రాము బంగారం లేదా వెండి ప్లేటింగ్‌తో పలు డిజైన్లలో రంగురంగుల సీజెడ్‌లను కూర్చి గాజులు రూపొందిస్తున్నారు. సింగిల్ లైన్, మల్టిపుల్ లైన్స్, బ్రేస్‌లెట్ స్టయిల్ గాజులు అందుబాటులో ఉన్నాయి. వజ్రాలను పోలిన కటింగ్‌తో తళతళలాడే సీజెడ్ గాజులు... సంప్రదాయ దుస్తులతోపాటు మోడరన్ డ్రెస్‌ల మీద కూడా చక్కగా నప్పుతాయి.



టోరమలీన్ గాజులు

టోరమలీన్ రాళ్లు పొదిగిన గాజులు ప్రత్యేకంగా కనిపిస్తాయి. విభిన్నమైన కటింగ్ విధానం వల్ల ఈ రాళ్లు నలువైపులా కాంతులు విరజిమ్ముతుంటాయి. గులాబీ, ఎరుపు, ఆకుపచ్చ, నీలం, నలుపు, గోధుమ రంగుల్లో లభించే టోరమలీన్ రాళ్ల గాజులను మహిళలు ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. పట్టుచీరలు లేదా భారీ ఎంబ్రాయిడరీ వర్క్‌లతో నిండిన లెహంగాల మీద ఇవి ఆకర్షణీయంగా కనిపిస్తాయి. రోజువారీ వేసుకోవడానికి కూడా సౌకర్యవంతంగా ఉంటాయి.



టోపాజ్ గాజులు

రంగురంగుల టోపాజ్ రాళ్లను కూర్చి రూపొందించిన గాజులు కూడా మహిళలను ఆకట్టుకుంటున్నాయి. లక్క, ప్లాస్టిక్, మెటల్ గాజుల మీద పలు ఆకారాల్లో ఉన్న టోపాజ్ రాళ్లను అతికిస్తారు. నీలం, గులాబీ, ఆకుపచ్చ, పసుపు రంగుల్లో చిన్న, పెద్ద సైజుల్లో ఉన్న టోపాజ్ రాళ్లతో చాలా రిచ్‌గా కనిపిస్తాయి ఈ గాజులు. వెడల్పుగా గోట్ మాదిరి కనిపించే ఈ గాజులను చేతికి ఒక్కటి వేసుకున్నా గ్రాండ్‌గా ఉంటుంది.

క్రీడా సమాచారం

7 నుంచి ఉమ్మడి పశ్చిమ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

పెదవేగి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా 19 ఏళ్ల విభాగం జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈనెల 7వ తేదీ నుంచి జరుగుతాయని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. 7వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా తణుకు ఎస్కేఎస్డీ మహిళా కళాశాలలో బాలికలకు చెస్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగాసన, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, త్రోబాల్ పోటీలు జరుగుతాయన్నారు. 8వ తేదీ పెదవేగిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో బాలురకు చెస్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగాసన, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, త్రోబాల్ పోటీలు జరుగుతాయన్నారు. 14వ తేదీన ఏలూరు సీఆర్‌ఆర్ కళాశాలలో బాలురు, బాలికలకు బాస్కెట్‌బాల్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 15వ తేదీ పెదవేగి గురుకుల విద్యాలయంలో బాల, బాలికలకు హేండ్‌బాల్, హాకీ, కేరమ్స్, రోల్‌బాల్ పోటీలు జరుగుతాయని, ఉదయం 9 గంటల నుంచి ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని, క్రీడాపోటీల్లో పాల్గొనే విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డుతో సహా సకాలంలో హాజరుకావాలని సూచించారు.

6న ఉమ్మడి జిల్లా క్రీడా ఎంపికలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఏలూరు జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని అన్ని యాజమాన్యాల హైస్కూళ్లలో చదివే బాలబాలికలకు అండర్-14, 17 విభాగాల్లో జిల్లాస్థాయి క్రీడాఎంపికలు నిర్వహిస్తున్నట్టు ఎస్జీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు, డీఈవో వెంకట లక్ష్మమ్మ, కార్యదర్శి కె.అలివేలుమంగ ఓ ప్రకటనలో పేర్కొన్నారు తైక్వాండో, హ్యాండ్‌బాల్ క్రీడల్లో ఈనెల 6న ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఉదయం 9 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయని వివరించారు. బాలబాలికలు తాము చదువుతున్న పాఠశాల హెచ్‌ఎం సంతకంతో ఎంట్రీఫారంను సమర్పించాల్సి ఉంటుందన్నారు. క్రీడాదుస్తులు, వాటర్ బాటిల్స్‌ను వెంట తెచ్చుకోవాలని సూచించారు. వివరాలకు 90308 94311 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు

ఏలూరు అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి):అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని అక్టోబరు 5వ తేదీ పురస్కరించుకుని తెలుగురాష్ట్రాల్లో విద్యా బోధనతోపాటు, కల్చరల్, స్పోర్ట్స్ ఆర్ట్స్ యోగా విభాగాల్లో ఉత్తమ సేవలందిస్తోన్న టీచర్లను గుర్తించి అవార్డులు అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు హైదరాబాద్‌కు చెందిన ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ స్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈ.ఎస్.ఎస్.నారాయణ మాస్టారు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులతో సత్కరించేందుకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అర్హులైన టీచర్లు దరఖాస్తులు చేయాలని, ఎంపికైనవారికి ఈనెల 12న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో పురస్కారాలను అందజేస్తామన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు అధ్యాపకులు, ఉపాధ్యాయులు తమ బోధన, శిక్షణ అనుభవాల పూర్తివివరాలు గల సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్ జిరాక్స్ కాపీలతోపాటు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు దరఖాస్తుకు జతచేయాలన్నారు. ఈనెల 10వ తేదీలోగా ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నంబరు 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, తిరుమలగిరి పోస్టు, సికింద్రాబాద్-15 చిరునామాకు పంపా లని కోరారు. వివరాలకు 96523 47207 నంబరులో సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచి ఏలూరులో స్కేటింగ్ పోటీలు

ఏలూరు రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఈనెల 6, 11, 12వ తేదీలలో స్కేటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ వెస్ట్ గోదావరి జిల్లా శాఖ కార్యదర్శి కేబీవీ రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు నవంబరులో కాకినాడలో జరిగే 37వ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోలర్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈనెల 9వ తేదీ లోపు దరఖాస్తులు అందజేయాలని మరింత సమాచారానికి 98491 37037 నంబరులో సంప్రదించాలన్నారు.

జాతీయస్థాయి పోటీలకు శనివారపుపేట జడ్పీ విద్యార్థులు



ఏలూరు రూరల్, అక్టోబరు 4, (ఆంధ్రజ్యోతి) : శనివారం పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్‌ఎం రవిప్రకాష్ తెలిపారు. అరిగెల అరవింద్, నవీన్‌కుమార్ ఇటీవల కర్నూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచారని తెలిపారు. వీరిద్దరు నవంబరు 4న ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక అయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఇద్దరు విద్యార్థులను ఎంఈవో-2 అరుణ్‌కుమార్ శిక్షణ ఇచ్చిన పీడీ పద్మలతను అభినందించారు.



సూర్యప్రభ వాహనంపై వున్న స్వామి,అమ్మవార్లకు హారతిస్తున్న అర్చకులు

'సూర్యప్రభ'పై శ్రీవారి చిద్విలాసం

ద్వారకాతిరుమల, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): వైఖానస ఆగమ యుక్తంగా నిర్వహించే ఆశ్వీయుజమాస దివ్య బ్రహ్మోత్సవాలు మూడో రోజు శనివారం వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సప్త అశ్వాలను అధిరోహించిన సూర్యభగవానుని వాహనంగా చేసుకుని.. తేజో విరాజితుడైన చిన్నతిరుమలేశుడు శనివారం ఉదయం క్షేత్రపురవీధుల్లో భక్తులను అనుగ్రహించారు. ఉదయం ఆలయంలో సూర్యప్రభ వాహనంపై ఉభయ దేవేరులతో శ్రీవారిని ఉంచి ప్రత్యేక అలంకరణ చేసి హారతులిచ్చారు. పిల్లనగ్రోవి ధరించి చిన్నికృష్ణుని అలంకరణలో ఉన్న స్వామివారు చిరు మందహాసధారియై తన ఉత్సవ వైభవాన్ని వీక్షించే భక్తులకు అభయ హస్తంతో వరాలు కురిపిస్తున్నట్టుగా కనువిందు చేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, అర్చకుల వేదఘోషల నడుమ ఉభయదేవేరులతో చినవెంకన్న క్షేత్రపురవీధుల్లో భక్తులను అనుగ్రహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు: ఉదయం 7 గంటలకు హనుమద్వాహనంపై శ్రీవారి గ్రామోత్సవం, రాత్రి 7 గంటలకు ఎదుర్కోలు ఉత్సవం. రాత్రి 8-30గంటలకు వెండి శేషవాహనంపై తిరువీధిసేవ

శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ ..

వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తజనులతోను, భవానీ దీక్షాదారులతోను శనివారం కిటకిటలాడింది. విజయవాడలో దుర్గమ్మను దర్శించిన పలు ప్రాంతాలకు చెందిన వారంతా మార్గమధ్యలో ఉన్న శ్రీవారి క్షేత్రానికి విచ్చేశారు. వేలాది మంది యాత్రికులు, భవానీ దీక్షాదారులు క్షేత్రానికి చేరుకుని తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. దాదాపు 20 వేల మంది పైబడి భక్తులు ఆలయానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీవారి ఉచిత దర్శనానికి గంటల తరబడి సమయం పట్టింది. దర్శనానంతరం వారంతా శ్రీవారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఆకాశంలో.. సోయగం


కారు మబ్బులు | అరుణ కాంతులు



ప్రకృతి ఎంతో రమణీయమైంది. క్షణక్షణానికి తన రూపురేఖలను మార్చుకుంటూ చూపరులను మైమరపిస్తుంటుంది. ఓ వైపు కారు మబ్బులు కమ్ముకుంటుంటే మరో వైపు అరుణకాంతులతో ఆకాశం ప్రజ్వలంగా మారింది. ద్వారకాతిరుమలలో ఈ రమణీయ దృశ్యాలు శనివారం సాయంత్రం వేళ కనువిందు చేశాయి.

- ద్వారకాతిరుమల





ఏలూరులో ఆటో డ్రైవర్ల ర్యాలీలో ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ తదితరులు.. మెసేజ్‌లను చూపిస్తున్న ఆటో డ్రైవర్లు.. పాలకొల్లులో ఆటో డ్రైవర్ల ర్యాలీ

మురిసిన ఆటో డ్రైవర్లు

» రూ.15 వేల ఆర్థిక సాయం జమ కావడంతో ఆటో డ్రైవర్ల హర్షం

అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూ ప్రభుత్వం వడివడిగా అడుగులు ముందుకు వేస్తోంది. గత దీపావళికి ఉచిత గ్యాస్ పథకాన్ని అమలు చేయగా.. ఇప్పుడు దీపావళికి ముందుగానే ఆటోడ్రైవర్లకు ఆర్థిక సాయం అందించి వారి మనసు గెలుచుకుంది. శనివారం 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమంలో భాగంగా రూ.15వేల ఆర్థిక సాయం అందించి మరో అడుగు ముందుకేసింది. ఈ పథకం ద్వారా పశ్చిమ గోదావరి జిల్లాలో 8,439 మంది, ఏలూరు జిల్లాలో 10,655 మంది ఆటో డ్రైవర్ల ఖాతాలకు ఆర్థిక సాయం జమ కావడంతో హర్షం వ్యక్తం చేశారు. ఆ మెస్సేజీలను ఇతరులకు చూపించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఆటో డ్రైవర్ల అభిప్రాయాలు ఇలా.. - న్యూస్ నెట్వర్క్

అనేక సమస్యలు తొలగించారు



ఆటో డ్రైవర్లపై గ్రీన్‌ట్యాక్స్ ఎత్తివేయడంతో పలు సమస్యలకు ప్రభుత్వంలో సత్వర సాయ్యం జరిగింది. ఇప్పుడు పెద్ద మనస్సుతో ఆర్థికంగా ఆదుకునేందుకు రూ.15వేలను జమచేయడం మాకెంతో ఆనందంగా ఉంది.

- లీలాకృష, ఏలూరు టౌన్ ఆటో యూనియన్ అధ్యక్షుడు

ఇది చాలా మంచి పథకం



ఆటో డ్రైవర్లకు, క్యాబ్, టాక్సీ డ్రైవర్లను ఆదుకోవడానికి ప్రభుత్వం సంకల్పించడం శుభ పరిణామం. గత ప్రభుత్వ హయాంలో వాహనమిత్ర కింద రూ.10వేలను జమచేసి, ఆ తర్వాత పలు ఇబ్బందులను సృష్టించారు. కూటమి ప్రభుత్వం రూ.15వేల ఆర్థిక సాయంతో ఆటోబాగు చేత, ఇతర వాటికి ఈ మొత్తం ఉపకరిస్తుంది.

- సూరిబాబు, ఆటోడ్రైవర్, ఏలూరు

మేనిఫెస్టోలో లేకున్నా..



ఎన్నికల మేనిఫేస్టోలో లేకున్నా ఆటో డ్రైవర్లకు ఏటా రూ.15వేలు ప్రభుత్వం జమ చేయాలని నిర్ణయించడం హర్షణీయం. గత వైసీపీ హయాంలో రూ.10వేలు ఇచ్చినా ఆర్టీవోల జరిమానాలతో పాటు రోడ్ల గోతులతో వాహనాల మరమ్మతులకే సరిపోయేవి కావు. ప్రస్తుతం రోడ్లు బాగున్నాయి.

- పి.రాజేష్‌ఖన్నా, పాలకొల్లు

ప్రతి కుటుంబానికి ఆసరాగా ప్రభుత్వం



ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఆసరాగా కూటమి ప్రభుత్వం నిలిచింది. ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం లేని రోజుల్లో రోజుకు అన్ని ఖర్చులు పోనూ రూ.1000 వరకు వచ్చేది. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన తరువాత రూ.400 కూడా గిట్టుబాటు కావడం లేదు. ఆటో కార్మికులకు ఆర్థిక సాయం చేయడం అభినందనీయం.

- కండిపల్లి నూకరాజు, పాలకొల్లు

ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది : సి.రాజ్‌కుమార్, నరసాపురం



స్త్రీ శక్తి పథకం వల్ల ఆటో డ్రైవర్లందరం చాలా నష్టపోయాం. మా బతుకులు రోడ్డున పడ్డాయి. అయితే సీఎం చంద్రబాబు డ్రైవర్లకు న్యాయం చేస్తామని ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకుంది. దానికి అనుగుణంగా ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం రూ.15 వేలు ఆర్థిక సాయం చేయడం ఆనందంగా ఉంది.

ఆటో డ్రైవర్లకు ఆసరాగా ప్రభుత్వం : కె.శ్రీనివాస్, నరసాపురం



ఆటో డ్రైవర్ల సేవలో భాగంగా డ్రైవర్లకు ఎంతో ఊరట నిచ్చింది. ప్రభుత్వం రూ.15వేలు ఆర్థిక సాయం చేయడం సంతోషంగా ఉంది. ఉచిత బస్సు వల్ల ఇబ్బందులు పడతామని గుర్తించిన ప్రభుత్వం న్యాయం చేసింది. కొన్ని ఇబ్బందులు వల్ల డ్రైవర్లకు సొమ్ములు పడలేదు. వారి సమస్యల్ని పరిష్కరించి అందరికి ఆర్థిక సాయం అందించాలి.

ప్రభుత్వం సాయం సంతోషకరం : చీలి అశోక్, రేలంగి



ఎనిమిదేళ్ల నుంచి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నా. ఆటో డ్రైవర్ల ఇబ్బందులను అర్థం చేసుకుని సాయం చేయడం ఎంతో సంతోషంగా ఉంది. గతంలో రోడ్లు బాగోలేక వాహనాలు చెడిపోయేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. చాలా సంతోషంగా ఉంది.

ఎంతో ఆనందం కలిగించింది : అంద్రు రాజశేఖరరావు, తీపర్రు



ప్రభుత్వం ప్రారంభించిన ఈ పథకం ఎంతో లాభదాయం. తన బ్యాంక్ ఖాతాకు రూ.15 వేలు జమ అయ్యాయి. ప్రస్తుతం ఆటోలు ఎవరూ ఎక్కకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. పిల్లల ఫీజులకు అప్పు చేయాల్సి వచ్చింది. ప్రభుత్వ సాయం ఎంతో ఆనందం కలిగించింది. సీఎం, డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు.

అన్ని వర్గాలకు మంచి ప్రభుత్వం : ఎస్. సత్యనారాయణ, ఆకివీడు



ప్రభుత్వం స్త్రీశక్తి పథకం ప్రవేశపెట్టిన తరువాత కిరాయిలు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఈ సమయంలో ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15వేలు ఖాతాలో జమ చేయడం శుభసూచికం. ఈ ప్రభుత్వం అన్ని వర్గాలకు మంచి చేస్తుంది.

మరో రూ.5వేలు ఇవ్వాలి : కె.వెంకటేశ్వరరావు, టీపీగూడెం



ప్రభుత్వం ఇప్పుడు ఇచ్చే డబ్బులకు అదనంగా వచ్చే సంవత్సరం మరో రూ.5వేలు కలిపి ఇవ్వాలి. ప్రభుత్వం ఆదుకుని రూ.15వేలు ఇవ్వడం అభినందనీయం. ప్రభుత్వం ఆటో డ్రైవర్లను మరింత ఆదుకోవాలి. ప్రభుత్వానికి బాసటగా మేమంతా నిలుస్తాం.

ప్రతిపక్షాల విమర్శలకు తావులేదు : బి.వరప్రసాద్, టీపీగూడెం



ప్రభుత్వం విధానంతో ప్రతిపక్షాల విమర్శలకు తావులేదు. 50 ఏళ్లు పైబడిన ఆటో డ్రైవర్లకు పెన్షన్ వంటి స్కీములు పెడితే బాగుంటుంది. ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయాలి. ఆటో డ్రైవర్ల సంక్షేమానికి మరిన్ని పథకాలు ప్రవేశపెట్టాలి.

సరైన సమయంలో సాయం చేశారు : ఆర్.శ్రీను, తణుకు



వచ్చే నాలుగు రోజుల్లో తన వాహనానికి బీమా చెల్లించాల్సి ఉంది. ఎలా చెల్లించాలనే ఆలోచనలో ఉన్న నాకు కూటమి ప్రభుత్వం రూ.15వేలు ఆర్థిక సాయం చేసి ఆదుకుంది. ఇది మర్చిపోలేని ఘటన. గ్రీన్ టాక్సు తగ్గించాలనే డిమాండ్‌ను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలి.

ప్రభుత్వం చేయూత అందించింది : జోసఫ్,ఆకివీడు



ప్రభుత్వం అన్నమాట నిలబెట్టుకుంది. ఆటో డ్రైవర్లకు మరింత చేయూత అందిస్తే బాగుంటుంది. గతంలో రోడ్లు బాగా లేకపోవడంతో వచ్చిన కిరాయిలు మరమ్మతులకే సరిపోయేవి. మిగిలేవి కావు. ప్రస్తుతం ప్రభుత్వంలో రోడ్లు వేయించడం వల్ల అటువంటి సమస్య లేదు.

ఆచార్యదేవో భవ

నేడు ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం



పోలవరం/ద్వారకాతిరుమల, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): మాతృదేవోభవ.. పితృదేవోభవ.. ఆచార్య దేవోభవ.. అంటే తల్లి, తండ్రి తర్వాత గురువుకి ప్రత్యేక స్థానం కల్పించారు. తల్లి జన్మనిస్తే.. తండ్రి బతుకునిస్తే గురువు బతకడం ఎలాగో నేర్పుతాడు. ఎంతటి మేధావి అయినా గురువు వద్ద విద్య నేర్చకపోతే ఆ చదువులు నిరర్థకం. అన్ని విద్యలను నేర్పేవాడు గురువు ఒక్కడే.. అక్టోబరు ఐదో తేదీ ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువులను వారి సేవలను గుర్తిస్తూ ప్రత్యేక కథనం. ప్రతి ఏటా అక్టోబరు ఐదో తేదీని ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటారు. విద్యను నేర్పి, బతుకునిచ్చిన గురువులను గౌరవిద్దాం.. పూజిద్దాం.. ఆరాధిద్దాం వారి బాటలో ప్రయాణిద్దాం.

ఆదర్శ ఉపాధ్యాయుడు డాక్టర్ పెద్దిరాజు..

● ద్వారాతిరుమల మండలంలోని గుణ్ణంపల్లి హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డాక్టర్ మద్దాల పెద్దిరాజు మాస్టారు. విద్యార్థుల నైపుణ్యాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వ్యాసరచన, వక్తృత్వ, పద్యపఠన పోటీల్లో మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలుపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులతో తెలుగు సబ్జెక్టుకు సంబంధించి అద్భుతాలు సృష్టిస్తున్నారు. 18 ఏళ్లుగా తన ఉద్యోగ ప్రస్థానంలో విద్యార్థులతో ఆయన ఎన్నో విజయాలు సాధించారు. పుస్తక రచయితగా సైతం పేరుగణించారు. పీహెచ్‌డీ చేసిన ఈయన 'శైలి రచనలు అనుశీలన, సాహితీ సిరులు' వంటి పుస్తకాలు ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. మండలంలోని పంగిడిగూడెం హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఆయన ప్రస్తుతం ఇదే మండలంలోని గుణ్ణంపల్లి హైస్కూల్‌కు బదిలీపై వెళ్లారు. పంగిడిగూడెం స్కూల్‌లో పనిచేసిన కాలంలో అక్కడ నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని తన సొంత డబ్బును వెచ్చించి షెల్ఫ్‌లు కట్టించారు. దాతల నుంచి నేరుగా దాదాపు 200 పుస్తకాలు సేకరించడంలో ప్రముఖపాత్ర పోషించారు. ప్రతీ విద్యార్థి తన పుట్టినరోజున ఓ పుస్తకాన్ని లైబ్రరీకి కానుగా ఇచ్చే సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. ఈయన చేస్తున్న కృషిని అభినందిస్తూ గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సైతం విద్యార్థుల ఉన్నతికి అవసరమయ్యే దాదాపు రూ.5వేలు విలువైన పుస్తకాలను అందజేశారు.



ఎమ్మెల్యే మద్దిపాటి అందజేసిన పుస్తకాలతో టీచర్ పెద్దిరాజు

వివాహేతర సంబంధానికి యువకుడి బలి

» హత్య కేసులో ఆరుగురి అరెస్టు » వివరాలు వెల్లడించిన గూడెం డీఎస్పీ విశ్వనాథ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విశ్వనాథ్

తణుకు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం ఓ యువకుడి నిండు ప్రాణం బలి గొంది. తణుకులో అదృశ్యమైన తాడేపల్లిగూడేనికి చెందిన మడుగుల సురేశ్ హత్య కేసులో ఆరు గురిని అరెస్టు చేసినట్టు గూడెం డీఎస్పీ విశ్వనాథ్ తెలిపారు. తణుకు పట్టణ పోలీస్ స్టేషన్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో కేసు వివరాలు వెల్లడించారు. తాడేపల్లి గూడేనికి చెందిన మడుగుల సురేశ్‌ను హత్య చేసి గోనె సంచిలో మూటకట్టి గోదావరిలో పడే సిన కేసులో ప్రధాన నిందితుడు న్యాయవాది తిర్రే సత్యనారాయణ రాజు, ఆయన సతీమణి తిర్రే శిరీష, తణుకు పాతూరు, ఐరగవరం కాలనీకి చెందిన వల్లూరి పండుబాబు అలియాస్ పండు, సరెళ్ల సాయి, బంటు ఉదయ్ కిరణ్ అలియాస్ బన్నీ, గంటా ఫణీంద్ర బాబులను అరెస్టు చేసి రిమాండుకు పంపించినట్లు తెలిపారు. తాడేపల్లి గూడేనికి చెందిన మడుగుల సురేశ్ గత నెల 23న తణుకులో అదృశ్యమవడంతో సోదరి ప్రశాంతి గత నెల 25న పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు సీఐ కొండయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేశారు. దర్యాప్తులో భాగంగా కేసు వివరాలు తెలుసుకుని అతి తక్కువ కాలంలోనే ఛేదించినట్టు తెలిపారు. యువకుడి హత్య అనంతరం మృతదేహాన్ని కారులో తరలించినట్లు వివరించారు. సుమారు పది రోజుల తర్వాత డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం రామేశ్వరం వద్ద గోదావరిలో గుర్తించినట్లు చెప్పారు. న్యాయవాది సత్యనారాయణరాజు భార్య శిరీషతో వివాహే తర సంబంధం నేపథ్యంలోనే హత్య జరిగిందన్నారు. మృతదేహాన్ని తరలించడానికి వినియోగించిన కారుతో పాటు మృతుడు సురేశ్ మోటారు సైకిల్, నిందితులు వినియోగించిన మోటార్ సైకిల్ కలిపి మూడు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పరారీలో ఉన్న కారు యజమాని, న్యాయవాది సోదరుడు తిర్రే విజయకృష్ణను త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. కేసును ఛేదించడానికి సహకరించిన సీఐలు ఎన్.కొండయ్య, బి.కృష్ణ కుమార్‌లతో ఎస్‌ఐలు ప్రేమ్‌కుమార్, ప్రసాదు, సిబ్బంది సంగీతరావు, సత్యనారాయణ, శ్రీధర్, అప్పారావు, రవి, అక్బర్, వెలగేశ్వరరావు, అన్వర్, శ్రీనివాసు, శివాజీ, రాంబాబు, రామారావు, చంద్రబోస్, లోక సుందరిలను డీఎస్పీ విశ్వనాథ్ అభినందించారు.


రైల్వేగేటు - పాట్లు

ఏలూరు పవర్‌పేట రైల్వే గేటు వద్ద ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు గేటు తెరుచుకోలేదు. ఈవిషయమై రైల్వే గేటు సిబ్బందిని అడుగగా మరమ్మతు వచ్చిందని, ఆలస్యం అవుతుందని ప్రయాణికులకు తెలిపారు. గేటు తెరవక పోవడంతో ఆ దారిలో వెళ్లే ప్రయాణికులు, ప్రజలు మరోదారి లేక రైల్వేగేటు కింద నుంచి దూరి అవస్థలు పడుతూ దాటి వెళ్లారు.

- ఫొటో గ్రాఫర్, ఏలూరు.




రైలు గేటు కింద నుంచి ఇబ్బంది పడుతూ వెళుతున్న దృశ్యాలు



మరమ్మతు చేస్తున్న సిబ్బంది

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

అత్తిలి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతులైన 20 మంది బాలికలకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా అత్తిలిలోని ప్రభుత్వ ఎస్‌వీఎస్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో సైకిళ్లు పంపిణీ చేశారు. అత్తిలి స్టేట్ బ్యాంక్ మేనేజర్ టీఎస్ఎన్‌వీకే శ్రీరామ్, భీమవరం డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎన్.రమేష్, అత్తిలి మండల ఎంఈవో ఎంపీఎలికె ప్రసాద్, చీఫ్ మేనేజర్ సురేష్, తాడేపల్లిగూడెం ఆర్‌బిఓ హెచ్ఆర్ మేనేజర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో సత్తెనపల్లిలో చేనేత రాష్ట్ర మహాసభలు

నరసాపురం టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6, 7 తేదీల్లో సత్తెనపల్లిలో జరిగే ఏపీ చేనేత కార్మిక సంఘం 11వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలంటూ శనివారం ఆ సంఘం నాయకులు బుడిద జోగేశ్వరరావు పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేశారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, 1-9 తరగతి విద్యార్థులకు యూనిఫాంగా చేనేత వస్త్రాలు వాడాలని, సబ్సిడీ రుణాలు అందించాలని, ఆధునిక యంత్రాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

అమ్మవార్ల ఊరేగింపులు.. నిమజ్జనాలు


పాలకొల్లులో అమ్మవారి ఊరేగింపు

నరసాపురం టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో శనివారం పలు చోట్ల అమ్మవార్ల విగ్రహాలను భారీగా ఊరేగించారు. స్టీమర్‌రోడ్‌లోని పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని మేళతాళాలు, త్రీన్ మార్, బాణసంచా కాల్చుతూ అమ్మవార్లను ట్రాక్టర్లపై పుర వీధుల్లో ఊరేగించారు. వలందర్ రేవులోని గోదావరిలో నిమజ్జనం చేశారు. మండపాల వద్ద భారీ అన్నసమారాధనలు నిర్వహించారు.

పాలకొల్లు అర్బన్: దసరా ఉత్సవాలు ముగియడంతో శనివారం పట్టణంలో పలు ప్రాంతాల్లో ప్రత్యేకంగా నెలకొల్పిన అమ్మవార్ల విగ్రహాలను మేళతాళాలతో ఊరేగించి, నరసాపురం కాలువలో నిమజ్జనాలు గావించారు. ఈసందర్భంగా పందిళ్లలో అఖండ అన్న సమారాధనలు నిర్వహిచారు.

కాళ్ల: దొడ్డనపూడి గ్రామంలో శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ విగ్రహాన్ని తీన్మార్ వాయిద్యాలు, విచిత్ర వేషధారణలు, బాణసంచా కాల్పుల నడుమ గ్రామోత్సవం నిర్వహించి పంట కాలువలో నిమజ్జనం చేశారు. పలు గ్రామాల్లో అమ్మవారి మండపాల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు.

పెనుగొండ: దేవి శరన్నవరాత్రులు సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాలు వేడుకగా నిర్వహించారు. వడలిలో వివేకానంద సర్కిల్ వద్ద అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు.

భీమవరం టౌన్: మెంటేవారి తోటలోని శ్రీబాలత్రిపుర సుందరి అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై అమ్మ వారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి డప్పు వాయిద్యాలు, గరగ నృత్యాలు, స్థానిక మహిళా భక్తులచే కోలాట ప్రదర్శనలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారిని పురవీధులలో ఊరేగించారు.

మొగల్తూరు: పలు గ్రామాల కూడళ్లలో నిలబెట్టిన అమ్మవార్ల విగ్రహాలను శనివారం భారీ ఊరేగింపు నిర్వహించారు. మొగల్తూరు కోట, వడయారేపేట, కూరగాయల మార్కెట్, పడమటిపాలెం, సత్రవపాలెం, రామన్నపాలెం గ్రామాల్లో నిలబెట్టిన అమ్మవార్లను భారీ మేళతాళాలు, విచిత్ర వేష దారణలు, బాణసంచా కాలుస్తూ, టీన్‌మార్ వాయిద్యాలతో అమ్మవార్లను గ్రామాల్లో ఊరేగించి నిమజ్జనం చేశారు.





నరసాపురంలో ఎమ్మెల్యే నాయకర్, ఇన్‌చార్జి రామరాజు .. తాడేపల్లిగూడెంలో ఎమ్మెల్యే బొలిశెట్టి, వలవల బాబ్జి శనివారం డ్రైవర్లకు నమూనా చెక్కులు అందిస్తున్న దృశ్యం.. పాలకొల్లులో మాజీ ఎమ్మెల్సీ అంగర, తణుకులో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంకటరత్నం మాట్లాడుతున్న దృశ్యం

డ్రైవర్లకు కూటమి అండ

డ్రైవర్ల ఖాతాల్లో రూ.15వేలు చొప్పున నగదు జమ

పలు ప్రాంతాల్లో కూటమి నాయకుల ఆధ్వర్యంలో వేడుకగా కార్యక్రమాలు.. డ్రైవర్ల ర్యాలీలు

నరసాపురం టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని విప్ నాయకర్ అన్నారు. శనివారం ఆటో డ్రైవర్ సేవా పథకంలో భాగంగా నియోజకవర్గంలోని 880 మంది డ్రైవర్లకు రూ.1.30 కోట్ల చెక్కును టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, మత్స్యకార అభివృద్ధి చైర్మన్ కొల్లు పెద్దిరాజులతో కలిసి అందించారు. అంతకు ముందు మొగల్తూరు నుంచి భారీ ఆటో ర్యాలీ నిర్వహించారు. కార్మిక చొక్కా ధరించి యూనియన్ నాయకులతో కలిసి ఆటో నడిపారు. కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, కమిషనర్ అంజయ్య, ఎంపీడీవో వీరభద్రరావు, ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, గోపికృష్ణ, వాతాడి ఉమా, కోటిపల్లి వెంకటేశ్వరావు, పాలూరి బాబ్జీ పాల్గొన్నారు.

మొగల్తూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ సేవా పథకం అమలు చేయడంతో శనివారం నియోజకవర్గ స్థాయి ఆటో యూనియన్ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో కృతజ్ఞతా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: సంక్షేమంతో పాటు అభివృద్ధి అజెండాగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో ప్రభుత్వం అనే పథకాన్ని శనివారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద కూటమి ఆధ్వర్యంలో ఇర్వహించారు. ఈ కార్యక్రమానికి తాడేపల్లిగూడెం ఎంపీపీ నాయక్ అధ్యక్షతన జరిగింది. భవన నిర్మాణ, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల బాబ్జి మాట్లాడుతూ గత ప్రభుత్వ విధానాల వల్ల ఖజానా మొత్తం గుల్లఅయ్యిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలు తప్పక అమలు చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఆటో డ్రైవర్లకు చెక్కులు అందజేశారు. ఆటో డ్రైవర్లు ధ్యాంక్యూ సీఎం సార్ అని సభ వద్ద ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. అనంతరం కిరాయిగా రూ.1000 ఆటో డ్రైవర్‌కు ఎమ్మెల్యే శ్రీనివాస్ ఇచ్చారు.

ఆకివీడు: ఆటో డ్రైవర్లకు నియోజకవర్గ పరిధిలో 1537 మందికి రూ.15వేలు చొప్పున ఖాతాలో నగదు జమ చేయడం జరిగిందని మండల ప్రత్యేకధికారి కే సీహెచ్ అప్పారావు తెలిపారు. శనివారం స్థానిక గాంధీజీ సెంటర్‌లో నియోజకవర్గ ఆటో రిక్షా, మ్యాక్సీ మోటార్ క్యాబ్‌ల డ్రైవర్లకు సమావేశం నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ బొల్లా వెంకట్రావు, క్లస్టర్ ఇన్‌చార్జీ గొంట్లా గణపతి, జీఎస్టీ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సుశీల, నగర పంచాయతీ కమిషనర్ కృష్ణ మోహన్, ఎంపీడీవో బాబూరావు, అసిస్టెంట్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

తణుకు: ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో తొంభైశాతం హామీలను మొదటి ఏడాదిలోనే అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అని ఏఎంసీ చైర్మెన్ కొండేటి శివ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు, రేరా సభ్యులు మంత్రిరావు వెంకటరత్నం(బాబు) అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఆటో డ్రైవర్ల సమావేశంలో మాట్లాడారు. తణుకు నియోజకవర్గంలో 1315 మందికి లబ్ధి చేకూరుతుందన్నారు.

పాలకొల్లు అర్బన్: ఆటోలు, కార్లు డ్రైవర్లకు ఏటా రూ.15వేలు చొప్పన ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయడంతో కూటమి ప్రభుత్వం మరో ముందడుగు వేసిందని మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ అన్నారు. స్థానిక ఏఎంసీ ఆవరణలో ఆటో డ్రైవర్లకు నగదు జమ చేసే కార్యక్రమం సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సభలో ముఖ్య అతిథిగా అంగర పాల్గొని ప్రసంగించారు. ముందుగా ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. సభకు పట్టణ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. దీనిలో భాగంగా తూర్పు గోదావరి జిల్లా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు రాజమండ్రి నుంచి ఫోన్‌లో తన సందేశం వినిపించారు. నియోజకవర్గ పరిధిలో 1139 మంది డ్రైవర్లకు నగదు జమ చేస్తున్నట్టు తెలిపారు. డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలిపారు.

మరింత తగ్గిన వరద గోదావరి


కోడేరు పుష్కరఘాట్ వద్ద తగ్గిన గోదావరి

ఆచంట, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి):గోదావరి ఉధృతి శనివారం నాటికి మరింత తగ్గింది. దీంతో మండలంలో పుష్కరఘాట్‌లు బయటపడుతున్నాయి. గోదావరి వరద తగ్గడంతో పుష్కరఘాట్‌లో బురద పేరుకుపోయింది. వరద తగ్గడంతో పడవల రాకపోకలు సాగిస్తున్నాయి.

అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

ఆచంట, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి బాబు దళిత ద్రోహిగా చరిత్రలో నిలిచిపోతారని ఆచంట నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పిల్లి రుద్రప్రసాద్ అన్నారు. చిత్తూరు జిల్లాలో అంబేడ్కర్ విగ్రహానికి కొంతమంది నిప్పు పెట్టడంపై నిరసన వ్యక్తం చేస్తూ ఆచంటలో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

బ్యాంకింగ్ కార్యకలాపాలపై శిక్షణ


శిక్షణ పొందిన విద్యార్థులతో ఒకేషనల్ ట్రైనర్, హెచ్‌ఎం, తదితరులు

పెనుగొండ, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి):ఒకేషనల్ కోర్సులు అనేవి ఇప్పటి విద్యా విధానానికి ఎంతో ఉపయోగకరమని హెచ్‌ఎం వి. సత్య ప్రియ రామ్ అన్నారు. దేవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృత్తి విద్య శిక్షణలో భాగంగా గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు పది రోజుల పాటు ఇంటర్న్‌షిప్ తరగతులకు హాజరై బ్యాంకింగ్ కార్యకలాపాలు, స్కీమ్స్ పరిశీలించి, బ్యాంకింగ్ వ్యవస్థలో అంతర్గత కార్యక్రమాలు వంటి వాటిపై శిక్షణ పొందారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ జి. చిరంజీవి, కె. వెంకటేశ్వరరావు, ఎ. రాంబాబు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

మొరాయించిన బస్సు..


బస్సు ఆగిపోవడంతో మరో బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

పెనుగొండ, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సులు ప్రవేశపెట్టడంతో బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. ఓవర్‌లోడ్‌తో ఉంటున్న బస్సుల ఫిట్‌నెస్ సక్రమంగా ఉండకపోవడంతో తరచు మొరాయిస్తున్నాయి. ఇలాంటి సంఘటనే శనివారం చోటు చేసుకున్నది. పెనుగొండ నుంచి సిద్ధాంతం వెళ్ళే ప్రధాన రహదారిలో ఆర్టీసీ బస్సు ఇంజన్‌లో సమస్య కారణంగా బస్సు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొవ్వూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు భీమవరం నుంచి రాజమండ్రి ప్రయాణికులతో కిక్కిరిసిపోయి వెళుతున్నది. ఈ నేపథ్యంలో మార్గం మధ్యలో బస్సు మధ్యాహ్నం 12.20 గంటలకు ఆగిపోయింది. ఫిట్నెస్‌లేని బస్సులు వినియోగించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వమే వైద్య కళాశాలలు నిర్మించాలి


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న చలసాని శ్రీనివాస్

పాలకొల్లు టౌన్, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి):పేద విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వమే వైద్య కళాశాలలు నిర్మించాలని వక్తలు అన్నారు. స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకుడు అజయ్ కుమార్ అధ్యక్షతన శనివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు మాట్లాడారు. పాలకొల్లు మండలంలోని దగ్గులూరులో మెడికల్ కళాశాలను పీపీపీ పద్ధతిలో నిర్మించడం వల్ల పేదలకు వైద్య చదువులు దూరం అవుతాయని అన్నారు. ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కె లక్ష్మణ్‌రావు, ఎంఎల్‌సి బి గోపి మూర్తి, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజ గోపాల్, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడి ఆత్మహత్యా యత్నం

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం మునిసిపాలిటీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న కూనపాముల నాగముని ఆత్మహత్యాయ యత్నానికి పాల్పడిన ఘటన శనివారం వెలుగుచూసింది. నాగముని బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడెం మునిసిపల్ కార్యాలయంలో 19వ వార్డు పారిశుధ్య కార్యదర్శి విధుల్లో తనపై వేధింపులకు పాల్పడుతున్నారని ఆవేదనతో నాగముని గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని ఆరోపించారు. అయితే వెంటనే కుటుంబ సభ్యులు తాడేపల్లిగూడెంలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు.

సమావేశాలకు డుమ్మాకొడితే చర్యలు

ఆకివీడు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అధికారులు కొందరు సమావేశాలకు రాకుండా నిర్లక్ష్యధోరణితో వ్యవహరిస్తున్నారని, రానున్న సమావేశాలకు హాజరు కాకపోతే హెచ్‌వోడీకి రిపోర్టు చేస్తామని ఎంపీడీవో డి.బాబూరావు హెచ్చరించారు. శనివారం మండల సమావేశం ఎంపీపీ కఠారి జయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. సంబంధిత శాఖాధికారులు సమావేశాలకు వచ్చినప్పుడు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు. ఈ-క్రాప్ నమోదు చేయించుకోకపోతే వ్యవసాయశాఖకు సంబంధించి సంక్షేమ పథకాలు రైతులు నష్టపోతారని వ్యవసాయాధికారి ప్రియదర్శిని తెలిపారు. కొట్టాడ, జంగంపాడు నుంచి ఉప్పుటేరు, మందపాడు తదితర వరకు డ్రెయిన్లకు ఆనుకొని ఉన్న ఆక్రమణలు తొలగిస్తామని ఏఈ జయప్రకాష్ తెలిపారు. ఆర్టీసీకి త్వరలో ఎలక్ట్రికల్ బస్సులు వస్తున్నాయని సమస్యలు పరిష్కారమవుతాయని సూపరింటిండెంట్ కాగితపు శ్రీధర్ తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత


లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమర్థపాలకుడు అని రాష్ట్ర మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. శనివారం తన కార్యాలయంలో 29 మందికి సీఎం సహాయ నిధి నుంచి వచ్చిన రూ. 23 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో గండేటి వెంకటేశ్వర రావు, వల్లభు శ్రీనివాస్, మండాది అవినాష్, మీసాల రాము, అల్లం తాతాజీ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని భవన నిర్మాణ, కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, పరిమి రవికుమార్, దాసరి అప్పన్న, గంధం సతీష్ పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్రాకు కృషి చేయాలి

తణుకు రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహనతో మెలగాలని తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ (సీడీపీవో) ఎం.శ్రీలక్ష్మీ కోరారు. శనివారం దువ్వ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో స్వచ్ఛ ఆంధ్రా-స్వర్ణ ఆంధ్రా ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఆమే పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకట లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఎంపీడీవో రాంప్రసాద్ బాధ్యతలు


ఎంపీడీవోకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

పెంటపాడు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి):ఎంపీడీవోగా పీపీఎస్ రామ్‌ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. తణుకులో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేసిన ఈయన పదోన్నతిపై ఎంపీడీవోగా పెంటపాడుకు వచ్చారు. ఇప్పటి వరకు ఎంపీడీవోగా కార్యాలయ సూపరింటెండెంట్ టీవీ సత్యనారాయణ బాధ్యతలు నిర్వహించారు.

మాజీ జడ్పీటీసీ ధనలక్ష్మి మృతి


ధనలక్ష్మి(ఫైల్)

మొగల్తూరు, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు మండల పరిషత్ మాజీ అధ్యక్షురాలు, మాజీ జడ్పీటీసీ, ప్రస్తుతం రామన్నపాలెం 2వ ఎంపీటీసీగా విధులు నిర్వహిస్తున్న అయితం ధనలక్ష్మి(63) శుక్రవారం రాత్రి అకస్మాత్తుగా మృతి చెందారు. 1994లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీపీగా గెలుపొందిన ధనలక్ష్మి 2006లో కాంగ్రెస్ నుంచి జడ్పీటీసీగా గెలుపొంది మండల అభివృద్ధికి విశేష కృషి చేశారు. ప్రస్తుతం వైసీపీ నుంచి ఆమె రామన్నపాలెం గ్రామ పంచాయతీ 2వ నంబర్ ఎంపీటీసీగా గెలుపొంది సేవలందిస్తున్నారు. ఈమె మృతి సమాచారం తెలిసిన వెంటనే ఎంపీడీవో త్రిశూల పాణి, కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌లతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ఆమె భౌతికకాయాన్ని దర్శించి నివాళులర్పించారు.

జనసేనలో వైసీపీ నాయకుల చేరిక

మొగల్తూరు, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి):కోమటితిప్పలో శనివారం 100 మంది వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి జనసేన తీర్థం తీసుకున్నారు. కోమటితిప్ప మాజీ సర్పంచ్ పైడి రత్నంరాజు, సొసైటీ మాజీ ఉపాధ్యక్షుడు కొల్లాటి రాంప్రసాద్‌ల ఆధ్వర్యంలో జనసేన మండల అధ్యక్షుడు కొల్లాటి గోపి నాయకత్వంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సత్తినేని మోహనరావు, సర్పంచ్ పులపర్తి సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ మేకల కుమార్ పాల్గొన్నారు.

ఇద్దరికి స్వచ్ఛ వారియర్స్ అవార్డులు



రామాంజనేయులు, ముత్యాలు

తాడేపల్లిగూడెం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి):స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిర్వహించిన ప్రతిష్టాత్మక స్వచ్ఛ వారియర్స్ విభాగంలో తాడేపల్లిగూడెం మునిసిపాలిటీలో పనిచేసే ఉద్యోగులకు రాష్ట్రస్థాయిలోను జిల్లా స్థాయిలోను అవార్డులు సాధించినట్టు మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు. పబ్లిక్ హెల్త్ వర్కర్ బొచ్చిలి రామాంజనేయులు రాష్ట్రస్థాయి స్వచ్ఛా వారియర్‌గా ఎంపికైనట్టు తెలిపారు. రామాంజనేయులుకు విజయవాడలో జరిగే సదస్సులో 6వ తేదీన అవార్డు అందిస్తారన్నారు. జిల్లా స్థాయి బెస్ట్ స్వచ్ఛ వారియర్‌గా మల్లిపూడి ముత్యాలు ఎంపికైనట్టు వెల్లడించారు. ముత్యాలకు ఈనెల 6న భీమవరంలో జరిగే సదస్సులో అవార్డు అందజేస్తారన్నారు.

ఆక్వా రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

కాళ్ళ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆక్వా రైతులు తమ చెరువుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆన్‌లైన్‌లో త్వరితగతిన నమోదు చేసుకోవాలని మత్స్య శాఖ అధికారి ఇందిరా ప్రియదర్శిని తెలిపారు. కాళ్ళ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సమావేశం ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటిని నియంత్రించాలని కోరారు. ఎలక్ట్రికల్ అధికారులు మాట్లాడుతూ సోలార్ యూనిట్లపై ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. అనంతరం ఉత్తమ ఎంపీపీగా అవార్డు పొందిన శిరీష విశ్వనాథరాజును సమావేశంలో ఘనంగా సత్కరించారు. సమావేశంలో జడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వర రావు పాల్గొన్నారు.

గుండె పోటుతో నక్కా మురళి మృతి


మురళి (ఫైల్)

పెనుగొండ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి):పెనుగొండ సొసైటీ అధ్యక్షులు నక్కా వేద వ్యాస శాస్త్రి సోదరుడు (అన్న) నక్కా శ్రీవైష్ణవరావు మురళి తణుకులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. మురళికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కొన్ని రోజుల క్రితమే శాస్త్రి పెద్ద అన్నయ్య అయిన బాలాజీ మృతి చెందారు. ఆ విషాదం నుంచి తేరుకోకముందే మరలా శనివారం ఉదయం మరొక సోదరుడు మురళీ మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి. మురళి మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ఆక్వాజోన్‌పై స్పష్టత ఇవ్వాలి


ఎంపీ పాకా సత్యనారాయణను అభినందిస్తున్న మండల పరిషత్ సభ్యులు

ఉండి, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): ఆక్వాజోన్ విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు ప్రజా ప్రతినిధులకు బ్లూప్రింటను అందజేయాలని రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ అన్నారు. శనివారం ఉండి మండలపరిషత్ సమావేశం ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా పలువురు ఎంపీటీసీలు మాట్లాడుతూ ఏది ఆక్వాజోన్ నాన్ ఆక్వాజోనో అర్థంకావడంలేదన్నారు. దీనిపై అధికారులు స్పష్టత అందించాలన్నారు. దీనిపై రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయశాఖ అధికారులు ఇతర శాఖల అధికారులు ఆక్వాజోన్ నాన్ ఆక్వాజోన్ విషయంలో రైతులకు బ్లూప్రింట్‌ను అందిచాలని సూచించారు. సభ్యులు తీసుకునివచ్చిన పలు ప్రశ్నలకు అధికారులు సమాధానాలు అందించారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణను పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కొండవీటి సాంబశివరావు, సూరవరపు కనకదుర్గ, ఎంపీటీసీ రాములమ్మ, ముస్నలూరి సువర్ణరాణి ఇన్‌చార్జి ఎంపీడీవో రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూమ్‌యాప్‌లో గ్రామసభ

పెనుమంట్ర, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పొలమూరు గ్రామపంచాయతీ గ్రామసభ శనివారం జూమ్‌యాప్‌లో నిర్వహించారు. ప్రజలు గ్రామ సమస్యలను గ్రామ సభకు వచ్చి సభ దృష్టికి తీసుకురావడం ఎప్పుడు జరిగే ప్రక్రియ. దీనికి భిన్నంగా జూమ్ యాప్ ద్వారా ప్రజలు ప్రశ్నలను సంధించారు. గ్రామ సభ జరుగుతున్న ప్రాంతంలో స్క్రీన్ ఏర్పాటు చేసి ప్రొజెక్టర్ ద్వారా సమావేశానికి హాజరైన అధికారులు ప్రజలకు తెలిసే విధంగా ఏర్పాటు చేసి జూమ్ యాప్‌లోనే అధికారుల వివరణ ఇప్పించారు.

ఎగ్జిబిషన్ సందర్శన

భీమవరం టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజోతి): సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమం అమలులో భాగంగా జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో చేనేత, టెక్స్‌టైల్స్, రెడీ మెడ్ ఉత్పత్తులపై ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను శనివారం జిల్లా కలెక్టర్ కలెక్టర్ చదలవాడ నాగరాణి సందర్శించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ ప్రదర్శించిన వస్త్రాల ధరలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. చేనేత వస్త్రాలు, రెడీమేడ్ దుస్తులపై జీఎస్టీ 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గింపు ద్వారా పేద మధ్యతరగతి వర్గాలకు సొమ్ము ఆదా అవుతుందన్నారు.

తణుకులో కుశలవ హ్యుండయ్ కార్ల సంబరాలు


తణుకులోని హ్యుండయ్ షోరూమ్

తణుకు, అక్టోబరు 4 (ఆంధ్ర జ్యోతి): విజయదశమి సందర్భంగా తణుకులోని జాతీయ రహదారి పక్క న ఉన్న హ్యుండయ్ షోరూమ్‌లో కార్ల కొనుగోలుదారులతో సందడిగా మారింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటి ంచిన జీఎస్టీ తగ్గింపుతో పాటు కంపెనీ ప్రకటించిన ఆకర్షణీయ ఆఫర్లతో దశమి రోజున 15కార్లు విక్రయించినట్లు పశ్చిమ గోదావరి జిల్లా ఆర్ఎస్‌వో మేనేజర్ కఠారి సిద్ధార్థ తెలిపారు. పండగ సీజన్‌లో బలమైన కస్టమర్లు కలిగిన హ్యుండయ్ ప్రసిద్ధ ఎస్‌యూవీ, పోర్ట్ ఫోలియో-క్రెటా, బుకింగ్‌లు రిటైల్ డెలివరీలో అసాధారణ పెరుగుదల కనిపించిందన్నారు. విజయ దశమి పండగ సీజన్‌ను బ్రాండ్ కోసం ఎప్పటికపుడు బలమైన వాటితో ఒకటిగా నిలిపినట్లు చెప్పారు.

ఆర్య వైశ్య సంఘ మండల అధ్యక్షుడిగా రమేశ్


రమేశ్

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షునిగా మోదుగగుంటకు చెందిన బోనగిరి రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సేవా కార్యక్రమాల్లో చురుగ్గా ఉండే ఆయన గ్రామ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షునిగా, మండల కార్యదర్శిగా, ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లా సబ్‌కమిటీ చైర్మన్‌గా, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్‌గా, జిల్లా ఆర్యవైశ్య సహాయ కార్యదర్శిగా పనిచేశారు. రమేశ్ మండల అధ్యక్షునిగా ఎన్నిక కావడంపై ఆర్యవైశ్య సంఘ నాయకులు సమయమంతుల వైకుంఠం, చిట్టూరి కాశీవిశ్వనాథం, ముత్తా శ్రీనివాస్, కామిశెట్టి కాశీవిశ్వనాథం తదితరులు అభినందించారు.

తాడేపల్లిగూడెం ఎంపీడీవోగా చంద్రశేఖర్


ఎంపీడీవో చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం ఎంపీడీ వోగా వి.చంద్రశేఖర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఉంగుటూరు మండల డిప్యూటీ ఎంపీడీ వోగా పనిచేస్తు పదోన్నతిపై తాడేపల్లిగూడెం వచ్చారు. తాడేపల్లిగూడెం, పెంట పాడు, ఉంగుటూరు మండలాల్లో సుదీర్ఘకాలం పాటు కార్యదర్శిగా పనిచేసిన అనుభవం ఉంది. చంద్రశేఖర్ బాధ్యతలు తీసుకున్న సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో ఎం వెంకటేష్, కార్యాలయ ఏవో ఆర్ఎల్ సుజాత, కార్యదర్శులు అభినందించారు.